అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తం

- అద్దె భవనాల్లో 128 కేంద్రాలు
- సొంతభవనాలు 27, విద్యుత్ సౌకర్యం లేవి 8
- మండలంలోని 20 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీ



సోములతండాలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

పాల్వంచరూరల్: ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ప్రాథమిక దశలో విద్యాబుద్ధులు నేర్చుకోవాలనే ప్రధాన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను నెలకొల్పాయి. పౌష్టికాహార లోపాన్ని అరికట్టాలని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఒకపూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సంత్సవరానికి రూ.కోట్లు ఖర్చు చేస్తుంది. అయితే ఆశయాలు బాగానే ఉన్నా ఆయా కేంద్రాల్లో టీచర్లు, సొంత భవనాలు లేక ఉన్న భవనాలకు విద్యుత్ సౌకర్యం లేక అస్తవ్యస్తంగా మారాయి. అద్దె భవనాల్లో మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఆశయం కుంటుపడుతోంది. పదేళ్లుగా అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేసే దిక్కు లేక విద్యార్థు చదువులు సాగడం లేదు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో ఐసీడీఎస్ పాల్వంచ రూరల్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 155 ఉండగా ఇందులో 27 కేంద్రాలకు మాత్రమే సొంతభవనాలు ఉండగా మిగిలిన 128 కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. అన్నికేంద్రాల్లో 6,508 మంది పిల్లలు, 767మంది గర్భిణులు, 660 మంది బాలింతలు ఉన్నారు.

ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు..

రెడ్డిగూడెం, రాళ్లచెలక, తిరకలపాడు, పూసలతండా, సీతారాంపురంపాడు, లక్ష్మీదేవిపల్లి, ఉల్వనూరు3, ఉల్వనూరు1, బంద్రుగొండ, రేపల్లేవాడ, గంగదేవిగుప్ప, నారాయణరావుపేట, సంగం, బోజ్యా తండా, మల్లారం, హమాలీ కాలనీ, పీడీ కాలనీ, వనమాకాలనీ, సీతారాపురం, ఎర్రబోరు కేంద్రాల్లో పదేళ్లగా టీచర్ పోస్టులను భర్తీ చేయడం లేదు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అంగన్‌వాడీ టీచర్ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గిరిజన అభ్యర్థులు లేని కారణంగా టీచర్ పోస్టులు భర్తీ కావడం లేదని ఐసీడీఎస్ అధికారులు అంటున్నారు. అదేవిధంగా మండలంలోని ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ఫ్యాన్లు లేక పిల్లలు ఉండలేక ఇబ్బందులు పడుతున్న సంబంధిత సీడీపీఓ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పర్యవేక్షణ లోపం..

ఉల్వనూరు, పాండురంగాపురం, జగన్నాథపురం మూడు సెక్టార్లు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో అర్హులకు పౌష్టికాహారం అందడం లేదు.

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి..



టీచర్ పోస్టులను భర్తీ చేయాలి. బాల్యదశలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే టీచర్లు లేకుంటే భవిష్యత్ చదువుకోలేని పరిస్థితి ఉంటుంది. రెడ్డిగూడెంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ లేని కారణంగా భోజనాలకు మాత్రమే వస్తున్నారు.

– మంగమ్మ, రెడ్డిగూడెం

ప్రతీనెల అద్దె భారం పడుతోంది..



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక ప్రతినెల అద్దె భారం ప్రభుత్వంపై పడుతోంది. పక్కా భవనాలు మంజూరు చేయాలి. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలి. టీచర్ లేని కారణంగా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు.

– తెల్లం అలివేలు, దంతలబోరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు..

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఏజెన్సీలో గిరిజన అభ్యర్థులకు మాత్రమే టీచర్ పోస్టులకు అర్హులు కానీ అర్హులు లేని కారణంగా టీచర్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఇన్‌చార్జ్‌లకు అయినా అవకాశం ఇస్తే భర్తీ చేస్తాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

– రేవతి, సీడీపీఓ

విషసర్పాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సంతోష్

కొత్తగూడెంఅర్బన్: విషసర్పాల పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రాణధార స్నేక్ రెస్క్యూ కోఆర్డినేటర్ సంతోష్ తెలిపారు. మంగళవారం వరల్డ్ స్నేక్ డే సందర్భంగా రాజీవ్‌పార్క్, ప్రగతి మైదాన్‌లో వాకర్స్‌కు, క్రీడాకారులకు పాములకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మహిళా కళాశాలలో జరిగిన అవగహన కార్యక్రమంలో సంతోష్ మాట్లాడారు. మనం చూసే జంతుజాతులలో పాము భిన్నమైందని, అవగాహన లేకపోవడం వల్లనే భయపడతారని, వాస్తవానికి పాములు, మనుషుల కన్నా ఎక్కువగా భయపడతాయన్నారు. సర్పాలు జీవ వైవిధ్యంలో భాగమేనని, సర్పాలు రైతు నేస్తం అన్నారు. పాము కాటు లక్షణాలు, కాటు వేసినప్పుడు చేయవలసిన, చేయకూడనివి వివరించారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

కొత్తగూడెంరూరల్: మండల కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించడముతో పాటు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని వారికి గౌరవం ఇవ్వాలని పోలీసులకు సూచించారు.

విధుల్లో చేరిన ఎస్‌ఐ

ఇల్లెందు: ఇల్లెందు రెండో ఎస్‌ఐ నాగుల్ మీరా పటాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2020 బ్యాచ్ ఎస్‌ఐగా ఉద్యోగం చేపట్టిన ఆయన ఏడూళ్ల బయ్యారం, అశ్వాపురం, కొత్తగూడెం –1 టౌన్ ఎస్‌ఐగా పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇల్లెందు ఎస్‌ఐగా నియామకం అయ్యారు. ఇప్పటికే ఇల్లెందులో ఎస్‌ఐ సందీప్ కుమార్ ఉన్నారు.

జీఓ 10 రద్దు చేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీఓ 10 రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 11వ రోజుకు చేరుకున్నాయి. రైతుసంఘం తరపున మద్దతు తెలిపి దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇచ్చే విధంగా నూతన జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, కె.సత్య, జి.పద్మ, ఎల్లమ్మ, దేవులి, సాయమ్మ, రాజమ్మ, అనసూర్య పాల్గొన్నారు.

వాగుపై తాత్కాలిక వంతెన నిర్మించండి..



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్, కౌన్సిలర్

ఇల్లెందు: ఇల్లెందు సమీపాన అలుగు వాగుపై శ్మశానవాటికకు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణానికి సమయం, సరిపడా నిధులు లేకోవడంతో తాత్కాలికంగా ఇనుప వంతెన నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇక్కడ ఏటా వర్షాకాలంలో వరద వస్తుండడంతో వాగుపై రాకపోకలు నిలిచిపోతాయి. గతంలో ఉన్న బ్రిడ్జి తెగిపోవడంతో శ్మశానవాటికకు వెళ్లేందుకు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఈమేరకు గతంలో మిట్టపల్లి వాగుపై తాత్కాలిక ఇనుప వంతెన నిర్మించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని అలుగు వాగుపైనా అదే తరహాలో నిర్మాణానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కటకం పద్మావతి తదితరులు మంగళవారం సింగరేణి జీఎం జాన్‌ఆనంద్‌ను కలిసి పరిస్థితిని వివరించగా ఆయన స్వయంగా వాగును పరిశీలించి ఇనుప వంతెన నిర్మాణానికి నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. ఈ మేరకు సుమారు రూ.2లక్షలతో తాత్కాలిక ఇనుప వంతెన నిర్మించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

రోడ్డు ఆగమాగం..



ఒడ్డుగూడెం- బర్లగూడెం రహదారి దుస్థితి

టేకులపల్లి: పాలకుల నిర్లక్ష్యం... అధికారుల అత్యుత్సాహం కారణంగా ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒడ్డుగూడెం నుంచి బర్లగూడెం పొలిమేర వరకు మట్టి రోడ్డే. ఐదు దశాబ్దాల నుంచి పక్కా రోడ్డుకు నోచుకోవడం లేదు. పలుమార్లు రోడ్లు మంజూరు అవుతున్నాయి. నిధులు కేటాయిస్తున్నారు. కానీ అటవీ అధికారుల అడ్డంకుల కారణంగా రోడ్డు నిర్మాణం జరగడం లేదు. చినుకు పడితే చాలు ఈ రోడ్డంతా బురదమయం. అసలే అడుగుకో గుంత. ఆటోలు, బైక్‌లు, కార్లు, కోళ్ల, గుడ్లు, కూరగాయల తదితర సరుకులు సరఫరా చేసే బొలేరోలు, ట్రాలీలు వెళ్లాలంటే నరకయాతనే. ఇప్పటికే పలువురు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు అనేకం. కానీ దశాబ్దాల నుంచి ఈ ప్రాంత ఆదివాసీలకు రోడ్డు కలగానే మిగిలిపోతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో చదువులు

మంగళవారం పలుచోట్ల అంగన్‌వాడీ బాట నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలని కోరుతూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇంటింటికీ రెండున్నరేళ్లు దాటిన ప్రతీ చిన్నారిని అంగన్‌వాడీలో చేర్చాలని తల్లిదండ్రులకు వివరించారు. వక్తలు మాట్లాడుతూ.. పిల్లలు అంగన్‌వాడీల్లో ఆటపాటలతో చదువు నేర్చుకుంటారని, ప్రతీరోజు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సూపర్‌బజార్(కొత్తగూడెం): బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



కొత్తగూడెంటౌన్: బడిబాటలో మొక్క నాటుతున్న అంగన్‌వాడీ టీచర్



ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను మంగళవారం కొత్తగూడెంలోని ఆయన నివాసంలో పాపకొల్లు గ్రామప్రజలు కలిశారు. గ్రామ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి, పరిష్కరించాలని వినతిప్రతం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోండి

పాల్వంచ: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం శివనగర్, గట్టాయిగూడెం ప్రాంతాలకు చెందిన కేటీపీఎస్ ఉద్యోగులతో కలిసి కొత్వాల, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామిని కలిసి సమస్యలు వివరించారు.

గురుకుల పాఠశాల సందర్శన

పాల్వంచ: కొత్తగూడెం మైనార్టీ గురుకుల పాఠశాలను ఎస్‌ఎస్‌యూపీ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ సందర్శించారు. వంటగదులు, కంప్యూటర్ గదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులలో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): విషజ్వరాలు ప్రబలకుండా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, సీపీఐ(ఎం ఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కొత్తగూడెం డివిజన్ నాయకుడు జాటోత్ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యాధికారులు తక్షణమే మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా గ్రామపంచాయతీల్లో క్యాంపులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విన్నవించారు.

'అంబేద్కర్ అభయ హస్తం' ప్రారంభించాలి

సుజాతనగర్: అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించాలని దళిత సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు మంగళవారం సుజాతనగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చేవెళ్ల వేదికగా దళితులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అదేవిధంగా 2017 నుంచి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరైన ఎంతోమందికి సబ్సిడీ ఇంకా మంజూరు కాలేదని, ఆ యూనిట్లు లబ్ధిదారులకు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేయాలని కోరారు. గుండేటి వెంకటరాములు, రాజు, మురిపిటి రాములు, సిరిగిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థినులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని శ్రీరామచంద్ర బాలికల ఉన్నత పాఠశాలలో 1997–1998లో పదో తరగతి చదివిన విద్యార్థినులు పాతికేళ్ల తర్వాత కొత్తగూడెంలో మంగళవారం కలుసుకున్నారు. గురువులకు పాదపూజ చేసి వారిని గౌరవించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురం గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలక వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. గ్రామంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించారు. మాట్లాడుతుతూ.. ఎవరి ఇళ్లను వారు శుభ్రంగా ఉంచుకోవాలని ఉన్న ఖాళీ పాత్రలు, సైకిల్ టైర్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొమరారం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆర్‌ఎంపీలతో మంగళవారం ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ లోహిత సమావేశం నిర్వహించారు. జ్వరాలు, ఇతరత్రా వ్యాధులతో వస్తే ఎక్కువ డోస్ ఇంజెక్షన్లు ఇవ్వొద్దని చెప్పారు.

'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: మహిళా స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి పేరుతో పలు పథకాలను ప్రకటించిందని సెర్ప్ ఏపీఎం కామిశెట్టి దుర్గారావు తెలిపారు. సెర్ప్ కార్యాలయంలో సీసీలు, వీఓఏలకు స్వయం ఉపాధి పథకాలపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.40 వేల నుంచి రూ.పది లక్షలు విలువ చేసే స్వయం ఉపాధి పథకాలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ మండలానికి కొన్ని యూనిట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించి, చైతన్యం కలిగించాలన్నారు. సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

టేకులపల్లి: మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో అండ్ మోటారు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఇరవై లక్షలకు పైగా అనేక కేటగిరీలలో వాహనాలు నడుపుతున్న కార్మికులు ఆటో, మోటార్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని వీరికి నేటి వరకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును గత ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఇటీవల కొత్త చట్టం తెచ్చిందని దీనివల్ల డ్రైవర్లకు జైలు శిక్ష, రూ.పది లక్షలు జరిమానా విధించడం అన్యాయమని వెంటనే 2019 ఎంవీ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరారు. భవిష్యత్ ప్రణాళిక రూపొందించుటకు ఈనెల 21 ఇల్లెందులో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటర్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 5వ మహాసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.నూనేశ్వరరావు, రేసు అంజయ్య, జగన్, మల్లేష్, శ్రీకాంత్, రమేష్, మధు, చంటి, సురేందర్, రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతుల రుణాలను ఎలాంటి నిబంధనలు విధించకుండా మాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ అనుబంధ తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రేషన్ కార్డు నిబంధన తొలగించి అందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. సాగులో ఉన్న పోడురైతులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చంద్ర నరేంద్రకుమార్, సలిగంటి శ్రీనివాస్, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, పూర్ణచందర్‌రావు, కుమారి హనుమంతరావు, తాళ్లూరి పాపారావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడులో రైతు సంఘం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రుణమాఫీ మార్గదర్శకాలను సవరించాలన్నారు. రేషన్ కార్డు, పీఎం కిసాన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో రాష్ట్రంలోని ప్రతీ రైతుకు రూ.2 లక్షల పంటరుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. ఏదీ పరగణనలోకి తీసుకోకుండా వ్యవసాయ రుణాలన్నింటినీ మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యల్లంకి మధు, యాసా రోశయ్య, తాతా నరసింహారావు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, పత్తిపాటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: ఐటీడీఏ ద్వారా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరైనా అటవీశాఖ అధికారులు భూములను దున్నుకోనివ్వడం లేదని వీరాపురం గ్రామ రైతులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దశాబ్దాలుగా సేద్యం చేసుకుంటున్న భూములను ఆక్రమించుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను గ్రామస్తులు సమష్టిగా పోరాడి నిలబెట్టుకున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఐటీడీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు చేశారని వివరించారు. అయినా నేటికీ అటవీశాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసేకునే ప్రయత్నాలు వీడటం లేదని, వర్షాలు కురవడంతో భూములు దున్నుకునేందుకు వెళితే అడ్డుకుంటున్నారని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైస్‌ఎంపీపీ మండల రాము, ఎంపీటీసీ పూనెం సురేందర్, బానోత్ రోజా పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకులు



మాట్లాడుతున్న జమలయ్య

జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య ఆరోపించారు. మంగళవారం జూలూరుపాడులో జరిగిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదానీ, అంబానీలకు జాతీయ సంపదను దోచిపెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 29న జూలూరుపాడులో జరగనున్న ఏఐటీయూసీ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, గార్లపాటి వీరభద్రం, పత్తిపాటి మహేష్, ఎస్కే బుడేన్‌పాషా, బాపట్ల పూర్ణచందర్‌రావు, పత్తిపాటి యోహాను, గార్లపాటి శివకృష్ణ, నల్లగట్ల జమలయ్య, వెంకటేశ్వర్లు, నరేష్, ఎస్కే నాగుల్‌మీరా పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్తరిక్షాలు

ట్రాక్టర్ల మోజులో పడి అప్పటి వరకు వినియోగంలో ఉన్న చెత్తరిక్షాలను మూలకు చేర్చారు. వాడకుండా వదిలేయడంతో అవి పనికిరాకుండా పోయాయి. ఎలాగూ తుక్కుగా మారాయని భావించిన పంచాయతీ అధికారులు వాటిని క్రమంగా వ్యర్థాలతో పాటుగా చెత్తకుప్పల్లోకి చేర్చారు. ఈ కారణంగా చెత్త సేకరణకు వినియోగించాల్సిన విలువైన రిక్షాలు నేడు చెత్తకుప్పల్లో తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి.



సీఎస్పీ బస్తీలో చెత్తలో కూరుకుపోయిన రిక్షా



ముత్తారపుకట్టలో...

ఇల్లెందురూరల్: గ్రామాలలో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చడంతోపాటు ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2016లో జిల్లా వ్యాప్తంగా ప్రతీ పంచాయతీకి ఒక్కో రిక్షా రూ.18వేల చొప్పున మూడు నుంచి నాలుగు రిక్షాలు సమకూర్చింది.

ఇలా కొనుగోలు చేసిన రిక్షాల సహాయంతో గ్రామాలలో రిక్షా కార్మికులు స్వయంగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడం ప్రారంభించారు. ఈ తరువాత క్రమంగా తడి, పొడి చెత్తను సేకరించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా సేకరణ ప్రారంభించారు. అయితే నాడు డంపింగ్ యార్డులు అందుబాటులో లేకపోవడంతో ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను గ్రామ పొలిమేరలలో డంప్ చేసేవారు. ఇది సమస్యగా మారడంతో క్రమంగా పంచాయతీ అధికారులే రిక్షాల సహాయంతో చెత్త సేకరణకు స్వస్తి పలికారు.

ట్రాక్టర్ల ప్రవేశంతో..

గ్రామాలలో పారిశుద్ధ్యం మరింతగా మెరుగు పర్చే లక్ష్యంతో 2019లో ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో బిల్లులు చెల్లించేలా సమకూర్చింది. ఆ వెంటనే ప్రతీ పంచాయతీకి డంప్‌యార్డ్‌లను కూడా అందుబాటులోకి తెచ్చింది. ట్రాక్టర్ల సహాయంతో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ ప్రారంభం కావడంతో రిక్షాలు అలంకారప్రాయంగా మారాయి. ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా చెత్తసేకరణకు ఉపయోగపడే రిక్షాలను పంచాయతీ అధికారులు విస్మరించడంతో అవి ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పట్టి పోయాయి. దీంతో అధికారుల కంట పడితే అక్షింతలు తప్పవని భావించిన పంచాయతీ కార్యదర్శులు వాటిని నిదానంగా చెత్త కుప్పల్లోకి చేర్చి చేతులు దులుపుకున్నారు. దీంతో రూ.లక్షల్లో ప్రజాధనం నిరుపయోగంగా అయింది.

నిధుల లేమి సమయంలో..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లను నడిపేందుకు అవసరమైన డీజిల్ కూడా కొనలేని దుస్థితికి చేరుకున్నాయి. ఇలాంటి సమయంలో గతంలో మంజూరైన రిక్షాలను మనుగడలో ఉంచుకుంటే నేడు చెత్త సేకరణకు ఎటువంటి అదనపు వ్యయం లేకుండా వినియోగించుకునే అవకాశం ఉండేది. కానీ పంచాయతీ కార్యదర్శులు చెత్తరిక్షాల జోలికి పోకుండా అప్పు చేసైనా ట్రాక్టర్లను మాత్రమే చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు.

వినియోగంలోకి తెస్తాం..



గ్రామపంచాయతీలలో చెత్త రిక్షాలు ఎన్ని ఉన్నాయి... వాటి ప్రస్తుత పరిస్థితిపై వివరాలు సేకరిస్తాం. చిన్నపాటి మరమ్మతులు చేయించి వెంటనే వినియోగంలోకి తెస్తాం. నిధుల సమస్య ఉన్నందున రిక్షాల ద్వారా చెత్త సేకరణకు ప్రాధాన్యమిస్తాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు